క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



స్టాన్‌లీ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: పట్టణంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి అధ్యక్షుడు స్టాన్‌లీ గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ శుక్రవారం ఉదయం వారి నివాసానికి చేరుకొని స్టాన్‌లీ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పట్టణ కన్వీనర్ నరసింహులు, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అదృశ్యం



శశియమ్మ (ఫైల్)



కాంతమ్మ (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన కురుబ రామాంజినమ్మ కుమార్తె కురుబ కాంతమ్మ (35) అదృశ్యమైంది. ఈ మేరకు తల్లి రామాంజినమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమందేపల్లి మండలం మండ్లికి చెందిన నంజప్ప కుమారుడు అంజప్పతో వివాహమైందన్నారు. భర్తతో గొడవపడి 9 నెలలుగా తమతోనే ఉందని తెలిపారు. భర్త ఇంటికి వెళ్లి మాట్లాడతామని చెప్పామన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు.

రొళ్ల: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన శశియమ్మ (55) అదృశ్యమైనట్లు అదే గ్రామానికి చెందిన శివరామప్ప తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన శశియమ్మ తిరిగి రాలేదన్నారు. ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతోందన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తెతో పాటు భర్త కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లు 70901211518, 9164475862 సంప్రదించాలని కోరారు.

ప్రైవేటీకరణ ఆపాలి



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: రవాణాశాఖలోని డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేటీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని సీఐటీయూ నాయకులు తెలిపారు. వెంటనే ప్రైవేటీకరణను ఆపాలంటూ తహసీల్దార్ శ్రీధర్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ప్రజల భద్రత, ప్రమాదాల నివారణను దృష్టిలో ఉంచుకొని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరి, రమేష్, బాబావలి, మహబూబ్‌బాషా, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మరవకొత్తపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

చిలమత్తూరు: మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి సమీపంలో సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్సులు లేని, హెల్మెట్ ధరించని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో చిలమత్తూరు , లేపాక్షి ఎస్‌ఐలు మునీర్ అహ్మద్, నరేంద్ర, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి

పెనుకొండ: డెమోక్రటిక్ టీచర్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరి 11న విజయవాడలో మహాధర్నా చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం , జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యంతర భృతి ఊసే లేదని, సరెండర్ లీవు చెల్లింపులు, పీఎఫ్ రుణాలు, ఏపీ జీఎల్ఐ రుణాలు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. మహాధర్నాకు ఉపాధ్యాయులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

నిరసనాగ్రహం



విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగానే హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలు విజయవంతమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు భారీగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబుతో పాటు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు.

- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాట
- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీల విజయవంతం
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- సీఎం చంద్రబాబు మోసకారంటూ నాయకుల మండిపాటు
- పెంచిన ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్



మడకశిర: ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఈరలక్కప్ప, నాయకులు



హిందూపురం: ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్ద గేట్లు వేసి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికతో పాటు నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మడకశిర: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా శుక్రవారం మడకశిర పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకత్వంలో ‘పోరుబాట’ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి వైఎస్సార్ సర్కిల్ మీదుగా విద్యుత్ డీఈ కార్యాలయం వరకూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ డీఈ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రాన్ని అందించారు.

చంద్రబాబు పచ్చి మోసగాడు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చి మోసగాడని విమర్శించారు. ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేయకుండా ప్రజలను నిండా ముంచారని విమర్శించారు. అబద్ధాలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అటకెక్కించి పేదలను రోడ్డు పాలు చేసిందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, లేకపోతే ప్రజలు నిలదీయడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అనంతరాజు, స్వారక్క, సరోజమ్మ, ఎంపీపీలు కవిత, ఈరన్న, వైస్ ఎంపీపీ మూర్తి, మండల కన్వీనర్లు త్రిలోక్‌నాథ్, స్టూడియో శ్రీనివాస్, నరసింహారెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ పుట్టకామప్ప, జేసీఎస్ మాజీ కన్వీనర్ మహేంద్ర, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, సచివాలయం కన్వీనర్ అంజలి, రాష్ట్ర బీసీ సెల్ సభ్యులు సత్యనారాయణ, నటరాజు, సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యుడు రేకులకుంట హనుమంతరాయప్ప, సురంగల నాగరాజు, తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మప్ప, కౌన్సిలర్లు అన్సార్‌ఖాన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

హిందూపురం: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం పట్టణంలో పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్. దీపిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ట్రాన్స్‌కో డివిజన్ ఇంజనీర్ ఆఫీసు వద్దకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుగా నిలిచి ఆఫీసులోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో తోపులాటల మధ్య డివిజన్ ఇంజనీర్ కార్యాలయంలోని వెళ్లి ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ ఉమాకు వినతిపత్రమిచ్చారు.

బాబు అంటే బాదుడే

టీఎన్.దీపిక మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ చంద్రబాబు హామీలు ఇచ్చి ఇప్పుడు ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు విద్యుత్ పెంచడం అనేది ఉండదని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. రూ.15,485 కోట్లకు ప్రజల నెత్తిన మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలపై తలకుమించిన భారం వేస్తే వారు జీవనం సాగించేదేలా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరుపేదల ప్రజలను దృష్టిలో ఉంచుకొని గత జగన్ ప్రభుత్వ పాలనలో 100 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారిపై ఎలాంటి భారం వేయలేదన్నారు. ఇప్పుడు మినిమం కరెంటు బిల్లుకు సర్దుబాటు చార్జీలు వేయడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఎగ్గొడుతున్నారని, రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు కూడా మంగళం పాడే దిశగా అడుగులేస్తున్నారని విమర్శించారు. పారిశ్రామిక వేత్తలకు రూ.కోట్లు విద్యుత్ రాయితీలిస్తూ రేషన్‌బియ్యం తిని బతుకుతున్న పేదల నుంచి ముక్కుపిండి విద్యుత్ చార్జీలు వసూలు చేయడమేంటని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ శివ, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, పట్టణ, మండల కన్వీనర్లు మన్సూర్ అహ్మద్, రాము, నిస్సార్ అహ్మద్, సీఎన్‌పీ నాగరాజు, రామకృష్ణారెడ్డి, వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు నాగమణి, మహేష్‌గౌడ్, మార్కెట్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దీపిక, నాయకులు

హామీల పేరుతో ప్రజలకు టోపీ



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: ‘ హామీల పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు టోపీ పెట్టారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించి.. ఇప్పుడు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం అదనపు భారం మోపడం సరికాదు’ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. నేతన్నల 500 యూనిట్ల ఉచిత విద్యుత్ గోవిందా, ఎస్సీ, ఎస్టీల 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గోవిందా.. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామికి వినతిపత్రం ఇచ్చారు.

పెంచిన చార్జీలు తగ్గించాల్సిందే..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ.. ఎన్నికల వేల విద్యుత్ చార్జీలను పెంచబోమని డప్పు కొట్టి చెప్పిన చంద్రబాబు.. నేడు గద్దెనెక్కిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కి ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా నేతన్నలకు 250 యూనిట్ల నుంచి 500 వరకూ ఇస్తామన్న ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన రూ.15,485 కోట్ల అదనపు భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పంచాయతీరాజ్ జిల్లా విభాగం అధ్యక్షుడు రాజారెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, పట్టణ కన్వీనర్ నరసింహులు, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సద్దాం, శేషాద్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, యాసిన్, గణప్ప, బాబు, కిరణ్, శ్రీరాములు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పిట్టాబాబు, దుర్గప్ప, గోపాల్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని పెంపొందించుకోవాలి

హిందూపురం టౌన్: వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఆదర్శ పౌరులుగా పరిగణించబడతారని శ్రీలంక దేశానికి చెందిన ప్రముఖ వక్త నిర్మలన్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ‘వ్యక్తిత్వ వికాసం’పై జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి, యువత సేవా గుణాన్ని పెంపొందించుకొని సమాజానికి తమ వంతు సహాయాన్ని అందించాలన్నారు. అనంతరం 110 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు యూనిఫామ్, క్యాప్స్, పెన్నులు బహూకరించారు. దాతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, బోజప్ప, ప్రకాష్ రావ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ యూనిఫాంను అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో అనఘాదత్త వ్రతం

హిందూపురం: పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డులోని దత్త దర్శిని నిలయంలో అనఘాదత్త ట్రస్ట్ చైర్మన్ విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో దత్త వ్రతాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకాలు, లలితా సహస్ర పారాయణం నిర్వహించి సాయంత్రం వ్రతం చేపట్టారు. నూతన సంవత్సర కాలమాలిని ఆవిష్కరించి ఉచితంగా పంచిపెట్టారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

గుడిబండ: భారత మాజీ ప్రధాన మంత్రి, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి అత్యంత బాధాకరమని మండల కేంద్రంలోని ఎంజేపీ ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పనిచేసిన కాలంలో ఎన్నో కీలక నిర్ణయాలను తీసుకున్నారన్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు, సమాచార హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకం, అమెరికాతో అణు ఒప్పందం, చంద్రయాన్, మంగళయాన్, విద్యాహక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఆధార్ కార్డు వంటివి మన్మోహన్ సింగ్ హయాంలో రూపుదిద్దుకున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. దేశం ఒక ఆర్థిక రంగ నిపుణుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. మాజీ ప్రధాని కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధాకర్ , ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూడా మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు.

పరిగి: దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని ఏఐసీసీ మెంబర్ కేటీ శ్రీధర్ తెలిపారు. మండలంలోని సేవామందిరం ఏఎం లింగణ్ణ విద్యా సంస్థల ప్రాంగణంలో మన్మోహన్ చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.



గుడిబండ: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంజేపీ ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

అగళి: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఇనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు వంద రోజుల్లో పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సూచనలు చేశారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మల్లేష్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

పరిగి: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం మండల పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి అయ్యప్ప మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు.రాత్రి సమయంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహించారు.

పరిశ్రమల స్థాపనకు ప్రజాభిప్రాయం ముఖ్యం

హిందూపురం: పరిశ్రమల స్థాపనకు తప్పనిసరిగా స్థానిక ప్రజల అభిప్రాయాలు ముఖ్యం. ఆ మేరకే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పెనుకొండ ఆర్డీఓ ఆనందరావు అన్నారు. శుక్రవారం హిందూపురం మండలంలోని తూమకుంట గొళాపురం ప్రాంతాల్లో నియో జిన్ ప్రాపర్టీస్ లిమిటెడ్ 350 ఎకరాల్లో స్థాపించనున్న పరిశ్రమల ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు అవసరమన్నారు. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. గ్రామసభ ద్వారా వచ్చిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

మడకశిరలో జల్లులు



వర్షంలోనే తడిసి వస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం వేకువజాము నుంచి మడకశిర పట్టణం, మండల పరిసర ప్రాంతాల్లో జడివాన కురిసింది. చలికి వృద్ధులు, ప్రజలు ఇబ్బందులు పడుతూ ఇంటికే పరిమితమయ్యారు.

ఎంపీటీసీ కుమార్తె మృతికి సంతాపం



శివమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మ కుమార్తె శివమణి (20) జ్వరం, ఆరోగ్య సమస్యలతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జమ్మానిపల్లి మూర్తి, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీ కవిత శుక్రవారం ఆర్ అనంతపురం వెళ్లి శివమణి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముస్లిం మతపెద్ద మృతికి సంతాపం



ఇలియాజ్ సాబ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని 5వ వార్డు ఆబాద్‌పేటకు చెందిన ముస్లిం మత పెద్ద జనాబ్ ఆల్ హాజ్ హఫీజ్ మొహమ్మద్ ఇలియాజ్ సాబ్ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు ఆసిఫ్‌వుల్లా, రామచంద్ర, హబీబ్, మహేష్ గౌడ్, వార్డు ఇన్‌చార్జ్ ఆసిఫ్‌ఖాన్, శబరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

యూటీఎఫ్ ప్రచార జాతా ప్రారంభం

మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ బైక్ ప్రచార జాతాను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శులు నరసింహప్ప, నరేష్ ప్రారంభించారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతను నిర్వహిస్తున్నారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలభింస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు భూతన్న, నాయకులు మాలింగప్ప,జోగప్ప, యూటీఎఫ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, కోటేశ్వరప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో జరగనుండగా విజయవంతం చేయాలని ప్రచార జాతా చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు.



మడకశిరలో ప్రచార జాతాను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు